
# శివరాతిరి జాతర

జగన్నాథశర్మ



ఆ రాత్రి అగ్రహారమంతా హడావిడిగా ఉంది. పాతిక ముప్పై గూడు బళ్ళలో అగ్రహారీకులంతా శివ సతీపురానికి తరలి వెళ్తున్నాం.

మర్నాడు మహా శివరాత్రి!

శివసతీపురాన జాతర జరగుతుంది. అగ్రహారానకది పది పన్నెండు మైళ్ళ దూరంలో ఉంది.

తరతరాలుగా శివరాతిరి జాతర రోజు, శివసతీపురాన దేవిడీ సంతర్పణచేస్తూ వస్తోంది. అందర్నీ సంతర్పణకు తోడ్చుకు వెళ్ళడం ఆనవాయితీ!

అర్థరాత్రి అగ్రహారాన్ని విడిచి ఎడ్ల బళ్ళన్నీ నది వొడ్డున పయనమయితే, మర్నాడు సూర్యోదయ వేళ శివసతీపురానికి చేరుకోగలుగుతాయి.

ఓ బండిలో వంటపాత్రలని నింపారు. మరో బండిలో కాయగూరల్ని నింపారు. వేరొక బండిలో బియ్యం బస్తాలనూ పప్పుల్ని చేరవేశారు.

కావాల్సిన సామగ్రినంతా బళ్ళ కెత్తుతున్నారు.

హరికెన్ లాంతర్లు, పెట్రొమాక్స్ దీపాల వెలుగులో దేవిడీ అంతా వెన్నెల విడిదిగా వుంది.

అమ్మకి క్షణం తీరికలేదు. కేకేసి నాన్న అడుగుతున్న వాటిని అందించగలగడంలో ఊపిరి కూడా తీసుకోవడం లేదామె. చేదోడుగా లక్ష్మిని ఉంచుకుందమ్మ! ఓ నోటుపుస్తకాన్ని ముందేసుకుని, పెట్రొమాక్స్ దీపం దగ్గరిగా కూర్చుని, పెన్సిల్‌తో మూర్తులన్నింటినీ చిట్టీ రాస్తూ, చలి కాగుతూంది లక్ష్మి. వోణీని వొంటి నిండా చుట్టుకుని గొంతికిలా కూర్చునుంది.

బ్రహ్మయ్య పంతులు కూతురు లక్ష్మి. పట్నంలో ఇంటర్ చదువుతోంది. పదహారేళ్ళ ప్రాయంలో ఉంది. చెంపకు, చారెడు కళ్ళు, చెవులకు జుంకాలు, ముక్కున పుడకతో చూడముచ్చటనిపిస్తోంది.

గుట్టగా పోసిన గుమ్మడి పళ్ళనానుకొని, లక్ష్మినే చూస్తున్నాన్నేను. పని చేస్తున్నట్టుగా పోజు పెట్టి, పని వాళ్ళనదిలిస్తున్నాను. నవ్వుకుంటోంది లక్ష్మి. పళ్ళబిగువున పెదవిని ఉంచి, 'నీ పని చెప్తానుండు' అన్నట్టుగా తల తాటిస్తోంది.

సంతర్పణ ప్రత్యేక వంటకంగా, బూందీని తయారు చేశారు. పది పెద్దపెద్ద గంపలలో బూందీని ఉంచారు. వాటిని రెండు బళ్ళల్లో సర్దారు.

ప్రయాణ సమయం దగ్గరయింది. కుటుంబాలుగా బళ్ళనెక్కుతున్నారంతా!

వంట బ్రాహ్మలూ, లక్ష్మి కూర్చునేందుకు ఓ బండిని కేటాయించారు. అందులోనే, నేనూ సర్దుకూర్చోవాలి. అయితే వంట బ్రాహ్మలింకా రాలేదు!

''వెధవలు! ఇంకా రాక ఎక్కడ చచ్చారు'' నాన్న వంట బ్రాహ్మలమీద విరుచుకుపడ్డారు. వెళ్ళి నన్ను



పిలుచుకు రమ్మన్నారు. ఆ అవసరం లేకపోయింది. వంట బ్రాహ్మలు రానేవచ్చారు. ఇద్దరు పిల్లలూ, ఆరుగురు వంట బ్రాహ్మలు వెరసి ఎనమండుగురు బండినెక్కి కూర్చునుంటే, లక్ష్మికీ, నాకు అందులో చోటు లేకపోయింది. ఎక్కడ కూర్చోవాలన్నది ప్రశ్నయింది. బూందీ గంపలున్న బండి దగ్గరకు నడిచాం. గంపల్ని కాస్తంత ముందుకు లాగి చోటు చేసి, కూర్చున్నాం. బండీ కదిలింది.

ఎదురెదురుగా నేనూ, లక్ష్మి కూర్చున్నాం! నిద్రను దూరం చేసేందుకు నాయుడేదో పాటందుకుని బండిని తోలుతున్నాడు. చలిలో ఇసుక మైదానంలో సరితోడు నదిలో ఆ పాట గువ్వలా గిరికీలు కొడుతోంది. అప్పుడప్పుడూ ఎక్కడిదో... ఏదో వెలుగు కిరణం గంపల నడుమ నుంచి తొంగిచూసి లక్ష్మి ముక్కునీ, నుదురుని తాకి తాకి తొలగిపోతోంది. ముణుకుల మీద ముఖాన్నుంచి కూర్చుంది లక్ష్మి. కుదుపులకి నా మీది మీదికొరుగుతోంది!

"బూందీ గంపలకి కాపలా ఎవరున్నారు లోపల" నాన్న కేక వినవచ్చింది.

"నేనున్నాను" సమాధానమిచ్చాను.

"జాగర్తొరేయ్! గంపలు దొర్లిపోకుండా చూడు" మళ్ళీ కేకేశారు నాన్న.

"సరి సరే" అన్నాను.

"మేమున్నామనక, నేనున్నానన్నావేమిటి" నిలదీసింది లక్ష్మి.

"మేమున్నామంటే 'ఎవరెవరు' అంటారు నాన్న. నీ పేరు చెప్పాననుకో! నా నుంచి నిన్ను విడదీస్తారు" అన్నాను.

"విడదీస్తే ఏమవుతుంది" అంది లక్ష్మి.

"జాతర ప్రయాణం, శుద్ధ దండగనిపిస్తుంది" అన్నాను.

"బూందీ తింటావా" అడిగాను.

"వద్దు" అంది. విన్పించుకోలేదా మాటను. గంపలోనుండి దోసెడు బూందీ తీసి లక్ష్మి ముందుగా ఉంచాను.

"వద్దంటుంటే" అంది. సరిగా కూర్చోమన్నట్టుగా నన్ను వెనక్కి నెట్టింది.

## ఇది నాటి అగ్రహారం కథ

"కాదంటే బూందీని తలంబ్రాలుగా పోస్తాను" బెదిరించాను.

"నేనేం బెదిరిపోను" అంది లక్ష్మి. కోపం సరదా ముంచుకొచ్చాయి. బూందీని లక్ష్మి తలపై నుంచి జారవిడిచాను. బొగడలు బొబ్బుకొచ్చిన వెలుగులో ముత్యాల్లా కానవచ్చాయి.

"పిచ్చిపట్టిందా" ప్రశ్నించింది.

"కాదు! ప్రేమ పుట్టింది" అన్నాను. మరో దోసెడు బూందీని తీసి లక్ష్మికి మళ్ళీ తలంబ్రాల్లా పోశాను.

"నిన్నేంచేయాలి" అంది. రోషం వచ్చినట్టుంది. చేతులు పట్టి నన్ను కూర్చోబెట్టి, తనూ ఓ దోసెడు బూందీ తీసి నాపై గుమ్మరించింది. కసి తీరినట్టు లేదు. మరో దోసెడు పోసింది.

"చాలు చాలు! పెళ్ళయిపోయింది" అన్నాను. లక్ష్మిని కౌగిలించుకున్నాను. నుదుటనో ముద్దు! కనురెప్పనో ముద్దు! ముక్కునో ముద్దుగా లక్ష్మిని ముద్దుపెట్టుకుంటూ మురిపాలు పోయాను. కాదనలేదు లక్ష్మి. వెచ్చవెచ్చగా వొదిగి పోయింది.

"చలేస్తోందా" అడిగాను. లేదన్నట్టు తలెత్తి చూసింది. చేతివేళ్ళతో నా ముఖాన్ని స్పృశించి పెదవులపై వేళ్ళనదిమి, పెదవులానించింది.

ఇటు నా పెదవులు! అటు లక్ష్మి పెదవులు! నడుమ నాజూకయిన సన్నని వేళ్ళు! వేగిరిపాటు పడితే, వేళ్ళ తెర తొలిగితే, లక్ష్మి పెదవులు, నా పెదవులంటి సరిగమలు పోతాయి. ఆ శుభసమయం ఎప్పుడు?

చర్నాకోలాను 'ఛెళ్' మనిపించాడు నాయుడు. నిద్ర నడక పోతున్న ఎడ్లు, సరినడకను సంతరించుకున్నాయి. సన్నగా పరుగు దీశాయి. ఆ కదలికకి, వేళ్ళు తొలగి, పెదవులు ఎదురు బొదురయి, పలకరించుకుని పరవశించి పోయాయి. కొన్ని క్షణాలలా గడిచాయి.

"నన్ను పెళ్ళాడరాదూ" అడిగాను.

"మారు మనువా" అంది లక్ష్మి.

"ఎవరికి? నీకా నాకా" అన్నాను.

"నాకే" అంది.

చర్నాకోలా, నా వెన్నున చరిచినట్టయింది.
చేష్టలుడిగి, గూడుకి చేరగిల్లాను.

"పెళ్ళెప్పుడయింది" లో గొంతుతో అడిగాను.

"చిన్నప్పుడు! నేను మూడో తరగతి చదువుతున్నప్పుడు! పదమూడో ఎక్కం కంఠస్థం చేస్తున్న రోజుల్లో, పట్నం గుళ్ళో నాకు పెళ్ళయిపోయింది! ఇప్పుడుంటున్నది అత్తవారింటనే" అంది.

"ఆయనేం చేస్తారు" భర్తనుద్దేశించి లక్ష్మిని అడిగాను.

"అపరకర్మలు చేస్తాడు! ప్రాణం పోయిన చోట ప్రత్యక్షమవుతాడు" అంది.

భయం వేసిందెందుకో! నా చేతులు లక్ష్మి పాదాలనంటి, అప్రయత్నంగా అస్థిరంగా కదిలాయి. కాలి మట్టెల్ని స్పృశించి, వెనక్కి జరిగాయి.

"చదువుకుంటానంటే, అత్తమామలు కాదనలేదు! కాలేజీలో చేర్చారు. మెళ్ళో మంగళ సూత్రాలు చూసి, తోటి విద్యార్థులంతా వెక్కిరిస్తున్నారంటే 'తీసి జాకెట్లో దాచుకో'' అన్నారు. అది అలవాటయింది" అంది.

"మీ ఆయన అందగాడేనా" అడిగాను.

"నా కంటికి అందగాడే" అంది. నవ్వింది. మంగళ సూత్రాలు తీసి మెళ్ళో వేసుకుంది. బెత్తుల్లా అంతలేసి మంగళసూత్రాలు మెరుస్తూంటే, మనిషి నిలువునా కుంచించుకుపోయి, తప్పుచేసినవాడిలా లెంపలేసుకోవాలనిపించింది.

వొదిగొదిగా కూర్చున్నాను!

సంప్రదాయాలు ఉన్నత మయినవి. కర్కశమయినవి. భయ పెడతాయి. బుజ్జగిస్తాయనిపించింది. ఆ మీదట జాతర ప్రయాణం ఇబ్బందనిపించింది.

"క్షమించేం" అన్నాను కాస్సేపటికి.

"ఎందుకు" అనినవ్వి–

"శివరాతిరి జాతరంటే ఇంతే! అంతా సరదానే" అంది లక్ష్మి. తెల్లారినట్టుంది. గుడి గంట మోగింది.

*